గీతాశ్రియము





ఇకుర్తి తిరుపతిరాయ విరచితము.

[సత్యసాధనినుండి పునర్ముద్రితము.]

మొదటికూర్పు.

వెల రు. 0—4—0

Printed at the
Satya Sadhani Press, Masulipatam

1928.

కృతిసమర్పణము



ఆ జన్మాంతర, మనంత కరుణాసముద్రుఁ డగు శ్రీరామభద్రుని దివ్య చరణ కమల సేవాసక్తునుస్వాంతుఁడై అతిమహత్తరంబును, అత్యంత పుణ్య ప్రదంబును అగు భీష్మ నిర్యాణ దివసమున — (ప్రభవ సం॥ మాఘ శుద్ధ ఏకాదశి) — నైహికము నీసడించిన అస్మజ్జనకునకు; అంకమార్యునకు; భక్తిపూరస్సరముగ నీకృతి నర్పించుకొనుచున్నాను.

గ్రంథకర్త.

పీఠిక

—o—

విద్యార్థుల కారంభదశనుండియు దైవచింతన మత్యావసర మనివర్తమానకాలమునందలి సుధీలోకాభిప్రాయమగుటచే, నే నద్దానిని బురస్కరించుకొని యీ గీతాశ్రయమును రచించితిని. ఇయ్యది చిన్న చిన్న గీతములతోఁ బూరింపఁబడినను బ్రాథమికవిద్యాలయములయందే మూఁడునాలుగుతరగతులవారికిఁ దప్పఁ గ్రింది తరగతులవారికిది యంతగా నందుబాటులో లేకున్నది. చిన్న గీతములని యీసడించనిచో మాధ్యమిక పాఠశాలలలో నీగ్రంథ మన్నితరగతులు నుపయోగించఁదగి యున్నది. కాని, నే నీ పొత్తమును 5, 6 తరగతుల యుపయోగమునే, ఆసించి వ్రాసియుంటిని. ఈ పుస్తకమును సమగ్రముగఁజూచి పరిశోధించి కొందఱు విద్యాధికులు సహితము నాతలంపునే బలపరచియుండిరి. కావున, జ్ఞానప్రదమును ముక్తిదాయకము నగు నా యీ చిన్నిపొత్తమును ప్రజలును ప్రభుత్వమువారును సమాదరించుటలో నెట్టి యభ్యంతరమును గలుగఁబోదనియుఁ బండితప్రకాండు లిందలి స్ఖాలిత్యములను గణింపఁబోరనియు విశ్వసించుచున్నాను.

గ్రంథకర్త

శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః

గీతాత్రయము



జగము లెవ్వని శక్తిమై సంభవించు
నెవఁడు పెంపొందఁ జేయు నింకెవఁడు త్రుంచు
నెవఁడు విశ్వంబు తానయై యొనఁగుచుండు
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

ఆది మధ్యాంత రహితుఁ డనంత గుణుఁడు
పరముఁ డవిచారుఁ డఖిలశుభ ప్రదుండు
నిర్వికారుఁడు సముఁడునై నెగడు నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

సర్వమున కతీతుండు మోక్షస్వరూపుఁ
డాదికారణుఁ డనుపముఁ డద్వితీయుఁ
డప్రమేయుండనఁగ నిగమంబు నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

స్వప్రకాశుఁడు, నిర్గుణుఁడు, క్షయరహితుఁడు,
వ్యాపకుండు, నిస్సంగుఁడు పరమ పురుషుఁ
డవ్యయానంద మయుఁడు, బ్రహ్మంబు నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

అనుపమగుణ ప్రపూర్ణుఁ డనంతుఁ డనఘుఁ
డష్టమూర్తి సర్వేశ్వరుఁ డచ్యుతుండు
సకలలోక సన్నుతపాత్ర చరితుఁ డెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

భక్తజనవత్సలుండు, కృపాపయోధి,
లోకకళ్యాణమూర్తి మోక్షైకవర్తి
వరదుఁ, డిందిరావరుఁడు, నక్షరుఁడు నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

సమధిక గుణాఢ్యులసదృశ శాంతియుతులు
సర్వసంగ విముక్తులు సంయమీంద్రు
లెవని ప్రాపును గోరి భజించుచుందు
రట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

జ్ఞానులాగమవేద్యులు సహృదయులు
సర్వభూతహితైక దీక్షానిబద్ధు
లెవని ప్రాపును గోరి భజించుచుందు
రట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

అతులభోగియై, యనుపమత్యాగియై, వి
రాగియై, జోగియై యహరహముఁ బ్రీతి
భక్తి నుతియించువారి పాపము లడంచు
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

ఎలమి నఖిలేంద్రియముల జయించి మించి
యలరు భక్తుల హృన్నిలయంబు లందుఁ
బ్రవిమ లానంద జ్యోతియై వరగు నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

తృణము మేరువు, మేరువు తృణముగాఁగ
క్షణములోఁ దల్లకిందులు సలుపఁ గలుగు
ప్రకటతర ప్రభావ కలన బరగు నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

అమరకోటిక, మునికోటి, కఖిలభక్త
కోటి కెవరేని ముఖ్యాను గూర్తురేని
గినిసి వారసి నిజశక్తి గీటడంచు
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

భవ వినాశము లెవనిక బాహిరంబు
లెవని సేవింపఁగలుగు మోక్షైక పదము
భూతగణముల కాధారభూతుఁ డెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

విమలమై. యోగిధ్యేయమై, వేదమయము
నై, మనోహరమై, యనన్య ప్రభావ
కలితమై యెవ్వని చరిత్ర వెలయుచుండు
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

కలుషమయులు, తమోగుణకలిత హృదయు
లైన దాసవ్రులేని, నేకైకదిక్కు.
నెవని సేవింప సాలోక్య మిచ్చుఁ బ్రేమ
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

స్వప్నమందైన నేమరు పాటునైన
దలఁచి యెఱుఁగని యొంతటిఖలుఁడు సహిత
మొక్కసారి స్తుతింపఁగా నుబ్బు నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

లోకములనెల్ల దన బొజ్జలోన దాల్చు
శక్తి, తాను లోకంబుల సర్వమయత
మెలఁగు నేరుపు; లెవనికిఁ గలిగియుండు
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

ప్రాణికోటికిఁ దెలియంగ రాని వాఁడు
ననుపమాన తేజోధనుఁ డంతరాత్ముఁ
డభవుఁ డాముష్మికార్థ్యుఁ డనఁగ నెవ్వఁ
డట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు

* * *

సాధుజనముల కెవ్వఁ డాశ్రయ మొసంగు
నెవఁడు సాధువర్గము నాశ్రయించు చుండు
గుణవిహీనుండెవండు సగుణుఁడు నెవ్వఁ
డట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు

* * *

బధిరునకు వీను లొసఁగి మూకకు వాక్ప్రసంగు
నొసఁగు జాత్యంధునకు దృష్టినియ్యఁగలుగుఁ
గొండ లెక్కించు నెవ్వఁడు కుంటికైన
నట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు

*　　　*　　　*

జప తప వ్రతములు శీల శౌచ దాన
ధర్మములు సంధ్యావందనాది సత్కృతములు
నెవని సంస్తవ స్తోత్రముల కీడుఁజాల
వట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

*　　　*　　　*

ఏపురాణ పురుషు సన్నుతించు భక్త
జన్మ జన్మాంతరార్జితంబులఁ దెలిపినట్టి
కల్మషంబెల్లఁ దొలఁగి మోక్షంబుఁగల్గు
నట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు

*　　　*　　　*

కామ్యములై యొప్పు సత్కర్మములందుఁ
గంటె నిష్కామములై భక్తిఁ గొల్చుజనుల
యందు నధిక ప్రసన్నత నొందు నెవ్వఁ
డట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు

*　　　*　　　*

ఎవనికృప బ్రహ్మ మొదలుగా నల్లలోక
పాలు రనయంబు విజ్ఞాన పథికు లగుచు
నాత్మపద వైభవంబుల నలరుచుందు
రట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

*　　　*　　　*

సగుణపరమైన యట్టి విశ్వంబునెల్ల
సృష్టిఁగావించి యందునజేరి, హేతు
భూతగుణయుక్తుఁడై వేడ్కఁబొలుచు నెవ్వఁ
డట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు

* * *

ప్రళయయుక్త వార్నిధి మధ్యఁబన్న గేంద్ర
శయ్య నిజసుఖానుభవసంసక్తి, లీల
యోగనిద్రను శయనించి యుండు నెవ్వఁ
డట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు

* * *

తనకుఁ దానయి వెలిఁగెడి ధన్యుఁడెవఁడు
దిక్కులేనట్టి వారికి దిక్కెవండు
భక్తజనముల ముంగొంగు పసిఁడియెవ్వఁ
డట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు

* * *

ఎవని చరితామృతముఁగ్రోలి యెల్లదురిత
బంధములఁబాసి సతతంబు భక్తవరులు
శుభగతాముష్మిక సుఖంబుఁ జూఱఁగొందు
రట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు

* * *

నిర్గుణ బ్రహ్మమయ్యుఁదా నిఖిలలోక
ముల సృజించు లీలను గుణమును వరించి
ధరణిభగవంతుఁడను నాఖ్యఁబరగు నెవ్వఁ
డట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు

* * *

ఎవని దివ్యమంగళరూప మెలమి దేవ
దేవవంద్యమై, యాద్యమై, భూతభావ
మై, స్వయం జ్యోతియై, గుహ్యమై, యెసంగు
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

ఎవని హృదయంబుఁ దొంగిలనెంచి దీక్ష
సుజనులెల్ల సుఖంబులఁ జూరఁబుచ్చి
ఆత్మ దారాసుతాదుల నైన విడుతు
రట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

ఎవనిమేలు గోరుచునుందు రెల్ల భక్తు
లెవ్వఁడా భక్తులకుఁ బ్రేమ నెల్లకాల
మేడుఁగడఁగాఁగ నుండు నాత్మేచ్ఛఁదవిలి
యట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

బ్రహ్మ విష్ణు శివాఖ్యలఁ బరగు నెవఁడు
భయద భవ బంధములఁ ద్రెంచు బలుఁడెవండు
విశ్వమునకుఁ దాఁ బ్రాణమై వెలయు నెవ్వఁ
డట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు

* * *

ధనముఁ, బ్రాయము, రూపముఁ, దగినవిద్య,
బలము, నఖిలభోగంబులు, గలిగియున్న
నెవని జింతింపకున్న రాణింప కుండు
నట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు

* * *

సతత సంసార గురుమద స్తబ్ధులగుచుఁ
గన్నుగానక తిరిగెడు కలుష మతుల
నెవఁడు భవబంధములఁ జుట్టి రోపుఁజెఱచు
నట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు

* * *

సకల భూతంబులకుఁ దానె జనన మరణ
పోషణములు గల్పించుచున్, భూరి శక్తిని
హేతుమాత్రముగా నిర్గుణుఁడగు నెవ్వఁ
డట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు

* * *

నియతి నెవ్వానికథలు వినిన, జదివిన,
భక్తి సంస్మరించుచునున్న, బహుళదుఃఖ
దాయకములగు జన్మబంధములు దల్గు
నట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు

* * *

కులవిహీనులు సహి[illegible] నే జ[illegible]
చరణ [illegible]
లీనులై సర్వజ్ఞ సేవ్య[illegible]
రట్టి జగదేక [illegible]ర్తి నే నా[illegible]యింతు

* * *

సకల జంగమ స్థావ[illegible]
లీలని సృష్టిగావించి [illegible] కల్ప[illegible]
దగ నొసంగి నె[illegible]
నట్టి జగదేక మూ[illegible] నే నాశ్రయింతు

* * *

బలమదోపేతు లెవ్వని గలఁతఁ గొందు
రొరుల కెవ్వని మార్గ మయోమయంబు
సతత క్షీర నీరధి నివాసస్థుఁ డెవ్వఁ
డట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు.

* * *

దుష్ట సంహారణంబు, విశిష్ట రక్ష
ణంబుఁ దనకృత్యములుగా మనమున నెంచి
యభవుఁ డయ్యుఁ బ్రభవించునట్టి డెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు.

* * *

సలిలమున ఫేనజాల మనలము నందు
ధూమమును మారిసులఁ దగ్నిఁ దోపఁజేయు
నేర్పుగలిగి వెలుఁగు మహనీయు డెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

శ్రీమ దంతర్హితైశ్వర్య ధామమునుఁ
గేవలానుభవానంద కేళిమునిఁగి
వ్యాప్య వ్యాపకాకృతుల నెవ్వండు పొలుచు
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

ఎవఁడు సర్వసంపత్కరుఁ డెవఁడు సర్వ
శక్తి బీజస్వరూపుఁ డింకెవఁడు సర్వ
శక్తి సంయుక్తుఁ డెవ్వఁడు శక్తి రహితుఁ
డట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు.

* * *

కర్మగుణ భేదములు లేక, కలిమిలేము
లంటఁ బోవక, రూపింప నలవియైన
రూపకుఁడుఁగాక, నెవ్వఁడు రూఢి మెరయు
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు.

* * *

వరుఁ దనాలంబుఁ డధిక గుప్తవ్రతుండు
ప్రకృతి, ప్రకృతి సంజనిత ప్రభావ కలితుఁ
డాద్యుఁడు, సనాతనుండు నైయలరు నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు.

* * *

భక్తి సంయుక్తిఁ గొల్చు తాపస వరులకు
దగ విరోధమునను నెంచు దైత్య వరుల
కొక్కరీతి ఫలంబుల నొసఁగు నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు.

* * *

ఎవని యంఘ్రి రాజీవ రేణువుల కల్మిఁ
బావనంబయ్యె గౌతమ పత్ని; సైచ
రాని నిజనాథు శాపనలంబునుండి
యట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

కలిమి లేమియు, సుఖము దుఃఖమును, గమన
మాగమనము, దయా నిర్దయాది ద్వంద
ములకతీతుఁడై చేపకఁ బొలుచు నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

సకల భూత మానస నివాసస్థుఁడయ్యు
నెవఁడు సద్భక్తిఁ దనను నుతించకుండు
జనుల మాయా నివశులుగఁ జలుపు చుండు
నట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు
* * *

మోహ మదమత్సరాదులు మొదలె లేక,
అనృత జడ దుఃఖ భావము లంటఁబోక
నిజ సుఖానంద తప్పుఁడై నెగఁడు నెవ్వఁ
డట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు
* * *

సృష్టిలీలల వేడ్కఁగాంక్షించి, స్వీయ
మాయఁగైకొని జగతిఁ దన్మాయలోన
దాను గుణవంతు డట్టులఁ బెనరు నెవ్వఁ
డట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు
* * *

ప్రకృతి డాసిడాయనిరీతి, ప్రాణికోటి
సృష్టి సంస్థితి లయములఁజేసి సేయ
నట్లు, పోయి పోవని భంగి నలరు నెవ్వఁ
డట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు
* * *

ఎవనినామ సంకీర్తన మెల్ల పాప
జాల ఘోరాటవుల కగ్నికీల లగుచుఁ
బ్రథిత నిర్వాణ సామ్రాజ్యపదమొసంగు
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు
* * *

చిత్తమనిశము సంసార దత్తముగుటఁ
గర్మవశతను ఫలితముల్ గ్రాలుచుంటఁ
బ్రజలెవని తత్త్వయోగంబుఁ బడయఁజాల
రట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

అనుపమానంద భోగభాగ్యాను భవ మ
కుంఠితము పూజ్యమునగు వైకుంఠమందు
శేషపర్యంక శాయియై చెలఁగు నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

ముక్తికాంతకుఁ దానకము గృతాంత
కింకరుల కగోచరము సకిల్బిషంబు
నగుచు నెవ్వని ఠావు పొల్పారుచుండు
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

ఎలమి కల్పాంత మురు తపంబుల నొనర్చి
యైన నజ బిడౌజాది సురాధినాథు
లెవని భావతత్త్వంబు గ్రహించఁజాల
రట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

నియతి నత్యుగ్ర యోగ సన్నిహితులగుచు
నలరు మునులకు సురలకు నందరాని
భవ్య నిర్వాణ సామ్రాజ్య భద్రుఁ డెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

జగతి నెవ్వేళ ధర్మంబు సన్నగిల్లి
కలుష పూరితమగునో, తత్క్షణమునందె
జన్మఁగైకొని పూని రక్షణము నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు
* * *

శ్వపచుఁడైనను నెవని సంస్మరణమున న
నంత విజ్ఞానవైభవమంది సురల
కేని బూజనీయుండగు చెలమినొప్పు
నట్టిజగదేకమూర్తి నే నాశ్రయింతు
* * *

ఎండమావులఁగని భ్రాంతి నేగు మృగము
కరణి సంసార సుఖమె మోక్షం బటంచు
నాస మనునారి కెవఁడు నిరాసఁ గూర్చు
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు
* * *

ఎవఁడు కల్పాంతమున సర్వ భువనములను
కుక్షి నిక్షిప్త మొనరించి ఘోరజలధిఁ
బట్టి గతి నిద్రఁగొను వటపత్రమందు
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు
* * *

కట్టకడకైన "శ్రీహరీ" కావుమనుచుఁ
బలికి తనువుఁ ద్యజించుట కలరి వాని
ఘోర దురితాటవుల నెల్లఁగూల్చు నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు
* * *

ఆదికూర్మము, ఫణినాథుఁ డవని, ఎవని
శాసన ప్రభావ కలిత శక్తి, లీలఁ
దగ సమస్తంబు నొదలఁ దాల్పఁగలిగె
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు
* * *

బాలుడయ్యును నాల గోపాలకులను
గావ గోవర్ధనంబెత్తఁ గలిగె నెవఁడు
రహిశిలీంధ్రముభంగి నిర్జరులు వొగడ
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు
* * *

తలఁప దేహేంద్రియాదు లాత్మయనుభ్రాంతి
హరిహరాదులై నను బొందునట్లుసేసి
భ్రాంతి కెడయయి వెలుఁగొందు బ్రహ్మమెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు.
* * *

ఎవని నామామృతముఁ గ్రోలు టేహ్యమనుచుఁ
బలుకు ఖలుల దుష్కృతికి చంచలములేదొ,
ఎవని భజనము సర్వదుష్కృత హారంబొ,
అట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు.
* * *

"మన్నుదింటి వదేలరా యన్న!" యంచు
విసిగి కోపించు మాతకే విశ్వమెల్ల
లేదు లేదంచు నోటిలో లీలఁజూపు
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు.
* * *

వసతినిడి, యభిమానపుం బలుకులొకటి
రెండు వల్కినంతనె దయ మెండుకొనఁగ
గుహున కానంద భాగ్యంబుఁ గూర్చె నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు.
* * *

అంతకుండేని భయకంపితాత్ముఁడగుచు
నేమఱచియైన నిజభటు లెన్నఁడేని
నెవనిభక్తుల దరిఁజేర నిచ్చగింపఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు.
* * *

వర్ష మొక కొంతకాలము, వలి మఱొక్క
కొంతకాలము, వేఁడిమి కొంతకాల
మిట్లు త్రివిధకాలములఁ గల్పించె నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు.
* * *

సత్వగుణ సంయుతము, మహాశక్తివంత,
మతి సమిష్టిరూపంబును నైనమాయ
కెవఁడధిష్ఠాన దైవమై యొసఁగుచుండు
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు.
* * *

విష్ణువని, ఈశ్వరుండని వేఱు వేఱు
భావముల నన్నుతించెడి వారి కల్లె
తోఁచుచు నభీష్టములఁ దీర్పఁజూచు నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు.
* * *

బ్రహ్మహత్యాఫలము, మధుపాన ఫలము
గురుసతీ సంగమఫలంబుఁ గూడ నెవని
మఱుగునాసించి నుతియింప మాయమగునొ
అట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు.

* * *

మది వినిర్మల మొనరించు నదియు, బ్రహ్మ
మిట్టి దట్టిదనుచు నిర్ణయించు నదియు,
నగుచు నెవని తారకనామ మలరుచుండు
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు-

* * *

సత్తను చసత్తనుచు నద సత్త టంచు
నిరవయవ మంచు నవయవ భరితమంచు
నెవని మాయాకృతిని నిర్ణయింప నేర
మట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు.

* * *

కల్పవృక్షం బనావశ్యకంబు నాగ
నెవని నామమంత్రము సక లేప్సి తంబు
లర్థి జనముల కిడుచుండె నహరహంబు
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు.

* * *

యజ్ఞదేహుండు యజ్ఞ రహస్యకుండు
యజ్ఞ మయుఁడును యజ్ఞ నియామకుండు
యజ్ఞపతి యజ్ఞఫలదుఁడు నై వెలుంగు
సట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

సప్తకోటి మహామంత్రసంయుతుండు
మంత్ర ఫలిత ప్రదర్శక మహితమంతుఁ
డఖిల మంత్రార్థ రూపకుఁ డగుచు నెగడు
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు
* * *

ప్రణవ మంత్రప్రవృత్తిఁ గల్పనముఁ జేసి
ప్రణవ శయ్యాతలంబున బవ్వళించి
ప్రణవమయ సుస్వరూపుఁడై వరలు నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు
* * *

జ్ఞానవర్ధను డజ్ఞాన ఘాతకుండు
జ్ఞానయుత మానసుల కెఱుఁగఁ దగువాఁడు
సకల విద్యల కరయ నాశ్రయుఁడు నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు
* * *

తతచతుర్విధ యోగముద్రల కతీత
మైనజ్ఞానయోగము సంతతాశ్రమముగఁ
గలిగి యోగిసులభుఁడయి యలరు నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు
* * *

వేదమయ విగ్రహుఁడు వేద చోదితుండు
వేదజీవనుఁ డత్యంత వేదహితుఁడు
వేదసన్నుతనాముఁడై. వేడ్కఁ దనరు
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

దైత్య : వరుఁడని దాక్షిణ్యతను వహించి
దైత్య ఖలుఁడని గా ఠిన్యతను వహించి
తనయు రక్షించి జనకుని తనువు జీల్చి
నట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు

* * *

తొల్లి యుపనిషత్తుల నెల్లఁ గొల్లఁగొట్టి
జలనిధిని జొచ్చినట్టి రాక్షసుని జిదిమి
తిరిగి స్రష్టకా వేదముల్ తెచ్చియిచ్చి
నట్టి జగదేక మూర్తి నే నాశ్రయింతు

* * *

కడగి ముయ్యేడు మారులు క్షాత్రలేశ
ప్రతతిఁ జీల్చి చెండాడి తద్రక్తసిక్త
ములఁ బితలఁదన్పి కౌతుకమున వెలింగి
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *


వసుమతీ తలమెల్లఁ జాపగతిఁజుట్టి
నట్టిదైత్యుని నిర్జించి యలఘు దంష్ట్రఁ
దాల్చి ధాత్రి నెప్పటియట్లుఁ దనరఁజేసి
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

అమృత కాంక్ష సురాసురు లబ్ధిఁ ద్రిచ్చు
చుండ దిగిపోవు కవ్వపుఁగొండ జరఠ
కచ్ఛ పాకృతి నిలఁబెట్టఁగలిగె నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

క్రతువుఁగాంచి, పూర్వాకృతిఁ గలుగఁజేసి,
విల్లువంచి, పల్లెను, బక్షి, వెలఁది, గపిని,
గపికులాధిపు, దనుజాగ్రగణ్యు, నేలి
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *



సవతితల్లి పెట్టినబాధ సైపఁజాల
కతుల తపముఁగావించి వియత్తలమున
జన్మదేహ సుస్థిరత నెసంగు నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు.

* * *

తండ్రి పున్నామ నరకంబుఁ దప్పఁ ద్రోచి
వసుధ ధేనువుగ నొనర్చి వస్తువితతి
నెల్లఁ బిదికి పృథు సమాఖ్య నెవ్వఁ డొప్పె
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు.

* * *

వృషభ రూపంబుఁ గైకొని వినుతయోగ
ముద్రవహియించి శాంత సముద్రుఁ డగుచు
మునుల కమనుల కెన్నఁడు ముదముఁ గూర్చె
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

బదరికా వనమందు [illegible] సంగి
నరుఁడు నారాయణుండను నాఖ్యలొప్ప
ద్వివిధ రూపంబులను గొని వెలిఁగె నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు..

* * *

వినయవృత్తిని నర్థించి విపులధాత్రి,
నాకసము, దాత, నొగి మూఁడుపాజ్జలందు
నణుచుకొన గల్గినట్టి మహాత్ముఁ డెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

*　　*　　*

ఘనమతికి దేవహూతికి గర్దమ ప్ర
జాపతికి గపిలాఖ్యతో జననమంది
సాంఖ్యయోగ ప్రభావంబుఁ జాటె నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

*　　*　　*

క్రూరతర వర్తనుండైన కారణమున
మాతులుండనియైనను మదినొకింత
జాలిఁగొనఁబోక కంసుని జదిపె నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

*　　*　　*

నీటమకరికిఁ జిక్కి పోరాటమొక్క
వేయివత్సరములు సల్పి వీలుఁదక్కి
కడకు ద్విరదమెవ్వని బిల్వఁ గలిగెముక్తి
యట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

*　　*　　*

క్రమత యుగ ధర్మముల నెఱుఁగఁ దగుగీతి
వేదవిభజనమొనరించి విశ్వధర్మ
ము నెఱింగించు సద్గ్రంథముల రచించి
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

*　　*　　*

అరయ సంజీవికన్న నత్యద్భుతంపు
శక్తి సంపన్నుడై కరస్పర్శమాత్ర
సకలవ్యాధులు నెవఁడు నాశనమొనర్చె
నట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

పరులయలజడి, దుర్మత పాపబలంబు
నడఁచ రాజభోగంబులనైన వీడి
జగతి ధర్మరక్షణమును జలిపె నెవ్వఁ
డట్టి జగదేకమూర్తి నే నాశ్రయింతు

* * *

సమాప్తము.